క్లుప్తంగా

నిలిచిన అప్పపల్లి వంతెన పనులు



ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని అప్పపల్లి వంతెన పనులు నిలిచిపోయాయి. ఈ ఏడాది మార్చిలో రూ.1.86 కోట్లతో పనులు ప్రారంభించారు. పునాది కొంత మేర పనులు చేసి వదిలేశారు. దీంతో గ్రామస్తులకు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వంతెన పనులు పూర్తిచేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణే లక్ష్యం



వేడుకల్లో నాయకులు

కౌటాల: ఎస్సీ వర్గీకరణే లక్ష్యమని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు పిట్టల సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని తలోడి చౌరస్తాలో బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేసి, వ్యవస్థాపకుడు మందకృష్ణ జన్మదిన వేడుకలను జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ ఎన్నో పోరాటలు చేశారని పేర్కొన్నారు. వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య, కౌటాల మాజీ సర్పంచ్ వొజ్జల మౌనిక్, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, నాయకులు నక్క శంకర్, విఠల్, రాంచందర్, రమేశ్, పురుషోత్తం, సురేష్, మహేశ్, సాయి, మంగేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు వారసంత వేలం

చింతలమానెపల్లి: మండలంలోని బాబాసాగర్ వారసంతకు మంగళవారం వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి శంకర్ తెలిపారు. ప్రత్యేకాధికారి కోటప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు వేలం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.వెయ్యి డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి



మృతిచెందిన ఎద్దు

బెజ్జూర్: మండలంలోని కృష్ణపల్లి గ్రామంలో ఆదివారం విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతిచెందింది. నికాడి శ్రీనివాస్‌కు చెందిన ఎద్దు ప్రతీరోజులాగా మేతకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగివచ్చింది. ఎద్దును ఇంటి వద్ద ఉన్న స్తంభం వద్ద కట్టేసి ఉంచాడు. ఈ క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందినట్లు బాధితుడు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అకాడి



పూజలు చేస్తున్న భక్తులు

కౌటాల: మండలంలోని గ్రామాల్లో ఆదివారం రైతులు భక్తిశ్రద్ధలతో అకాడి పండగను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు మొక్కులు చెల్లించారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు పండాలని పూజలు చేశారు. ఏటా గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో అకాడి వేడుకలు నిర్వహిస్తామని రైతులు తెలిపారు.

జాతీయ రహదారి మరమ్మతు పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భీమారం: మండలంలోని జోడువాగుల వద్ద రోడ్డు పనులను ఆదివారం కాంగ్రెస్ నాయకులు నరేశ్, రవితేజ, తిరుపతి పరిశీలించారు. మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారిలోని జోడువాగుల వద్ద రోడ్డు ధ్వంసం కావడంతో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి నేషనల్ హైవేస్ అధికారులతో మాట్లాడి మరమ్మతులకు నిధులు మంజూరు చేయించారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

మూగజీవాలకు ఇక్కట్లు



- మండలంలో పశువైద్యశాల కరువు
- సకాలంలో అందని వైద్యం
- మృత్యువాత పడుతున్న పశువులు

లింగాపూర్: లింగాపూర్ మండలం ఏర్పడి ఎనిమిదేళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోవడం లేదు. మండలంలో సౌకర్యాలు లేక మండలవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పశువైద్యం అందక వివిధ గ్రామాల్లో పశువులు మృత్యువాత పడుతున్నాయి. మండలంలో పశు వైద్యశాల లేకపోవడంతో పశువుల చికిత్సకు అవసరమయ్యే మందులు సకాలంలో అందక పశువులు ప్రాణాలు కోల్పోతున్నాయి. దీంతో రైతులు,పశువుల కాపరులు తీవ్రంగా నష్టపోతున్నారు.

మండలంలోని పశుసంపద..

మండలంలో 2018 లెక్కల ప్రకారం ఆవులు, గేదెలు కలిపి 10,218 ఉండగా మేకలు, గొర్రెలు 8000 వరకు ఉన్నాయి. పశువైద్యశాల లేకపోవడంతో మండలంలోని పశుపోషకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పశువులకు రోగాలు వచ్చినప్పుడు, గాలికుంటు, లంపిస్కిన్, వంటి వ్యాధులు సోకినప్పుడు ప్రైవేట్ మెడికల్ షాపుల్లో ఔషధాలను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉందని వారు వాపోతున్నారు. కొన్నిసార్లు ఆర్థిక ఇబ్బందుల్లో ప్రైవేట్‌లో మందులు కొనలేని పరిస్థితుల్లో సిర్పూర్ ప్రభుత్వ పశువుల ఆస్పత్రికి పశువులను తరలిస్తున్నారు. అక్కడికి వెళ్లాలంటే పశువులను తీసుకొని 12 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. పైగా ప్రైవేట్ వాహనదారులు అధికంగా చార్జీలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మామిడిపల్లి గ్రామంలో ఒకేఒక మైత్రి సెంటర్ నిర్వహిస్తున్నారు. ఒక్కడే నిర్వాహకుడు మండలంలోని అన్ని పశువులకు చిన్నపాటి చికిత్స అందిస్తున్నాడు. సకాలంలో చికిత్స అందకపోవడంతో పశువులు మృత్యువాత పడుతున్నాయని మండలవాసులు వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పశువైద్యశాల ఏర్పాటు చేయాలని విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదని, ప్రస్తుతం ఏర్పడ్డ కొత్త ప్రభుత్వంలోనైనా పశువైద్యశాల నిర్మాణం చేపట్టాలని పేర్కొంటున్నారు.

పశువుల బీమాకు మంగళం..

ఉమ్మడి రాష్ట్రంలో ప్రవేశపెట్టిన బీమా పథకం 2016 వరకు కొనసాగింది. అప్పటి నుంచి బీమా పథకం అమలు చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. పశువుల బీమాను మళ్లీ అమలు చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. వర్షకాలంలో పశువులకు లేనిపోని రోగాలు సంభవిస్తే సరిపడా ఆస్పత్రులు లేవు. మండలంలో రెండు లేదా మూడు గ్రామాలలో పశువైద్య సబ్‌సెంటర్లను నిర్మించి, మండలకేంద్రంలో పెద్ద ఆసుపత్రి నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైద్యం అందడం లేదు



మండలంలో పశువైద్యశాల లేకపోవడంతో సిర్పూర్ పశువుల ఆసుపత్రికి జీవాలను తరలిస్తున్నాం. సరైనా సమయంలో వాహనాలు దొరక్క, వైద్యం అందక పశువులు మృత్యువాత పడుతున్నాయి. అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. ఇప్పటికైనా స్థానికంగా పశువుల ఆసుపత్రి నిర్మించాలి.

– జాదవ్ రామారావు, రైతు, లింగాపూర్

వానాకాలంలో ఇబ్బందులు



మండలంలోని పశువులకు సరైన వైద్యం అందక, వైద్యుల పర్యవేక్షణ లేక ఏటా మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. వివిధ గ్రామాలలో ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో 100 నుంచి 200 వరకు పశువులు, మేకలు వివిధ రకాల వ్యాధులతో చనిపోతున్నాయి.

– జాదవ్ అశోక్, రైతు, లింగాపూర్

వానమ్మ జాడేది?



దహెగాం పెద్ద చెరువు కింద సాగు భూములు

- చెరువుల ఆయకట్టు కింద బీళ్లుగా పొలాలు
- బోర్ల కింద సాగు పనులు

దహెగాం: వానాకాలం సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి భారీ వర్షం కురువలేదు. గతేడాది చెరువులు, ప్రాజెక్టులు, కుంటలు నీటితో నిండిపోయాయి. ఈ సంవత్సరం భారీ వర్షం కురిసిన దాఖలాలు లేవు. కార్తెలు కరిగిపోతున్నాయి. దీంతో వరి సాగు వెనుకబడ్డదని రైతులు ఆందోళన చెందుతున్నారు. బోర్లు ఉన్నవా రు మొలక అలికి పొలాన్ని సన్నద్ధం చేసుకుంటున్నారు. కానీ చెరువులు, ప్రాజెక్టుల కింద ఆయకట్టు రైతులు ఇంకా పనులు మొదలుపెట్టనే లేదు. దీంతో వరి సాగు అయ్యేనా అన్న అనుమానాలు కలుగుతున్నాయి.

మోస్తరు వర్షాలే..

వర్షాకాలం ప్రారంభమై నెలరోజులు కావస్తున్నా రెండు కార్తెలు కరిగిపోయాయి. ఇప్పటి వరకు మోస్తరు తప్ప భారీ వర్షం కురువలేదు. భారీ వర్షం కురవాలని రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. కాని వరుణ దేవుడు కరుణించడం లేదు. గత సంవత్సరం చేసిన అప్పులు తీరక మళ్లీ ఈ సంవత్సరం అప్పుల పాలవుతామోనని దిగాలు చెందుతున్నారు.

12 వేల ఎకరాల్లో వరిసాగు..

మండలంలో ప్రతీఏటా 10 నుంచి 12 వేల ఎకరాల వరకు వరి సాగవుతోంది. కానీ ఇప్పటివరకు పొలాలు దున్నడం, మొలక అలకడం, నారుమడులు సిద్ధం చేయడం తదితర పనులు చేయలేదు. బోర్లు ఉన్న రైతులు నారుమడలు సిద్ధం చేసుకుంటున్నారు. జూలై రెండో వారంలో వరినాట్లు వేసే సమయం నాట్ల సంగతి దేవుడెరుగు ఇంకా ఒక్క భారీ వర్షం కురువనే లేదు. చెరువులు, ప్రాజెక్టుల్లోకి వరద నీరు రాక చెరువులు బోసిపోతున్నాయి. ఆయకట్టు పొలాలు బీళ్లుగానే మారుతున్నాయని రైతులు వాపోతున్నారు.

గుడ్లబోరిలో వైద్యశిబిరం

సాక్షి స్పందన

కౌటాల: 'గుడ్లబోరిలో జ్వరం పంజా'శీర్షికన ఆదివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. బాబాపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి రాజ్‌కుమార్, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ, పంచాయతీ సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటింటికి వెళ్లి జ్వరంతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించారు. ప్రతి కాలనీలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి 109 మందికి పరీక్షలు చేశారు. పలువురి నుంచి రక్త నమూనాలు సేకరించారు. వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామంలో కొందరి జ్వరాలు తగ్గముఖం పట్టినప్పటికీ ఒళ్లు, కీళ్లనొప్పులతో బాధపడుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలన్నారు. అదేవిధంగా గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. మురుగుకాల్వల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. హెచ్ఈఓ ఇందిరాగాంధీ, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, ఏఎన్ఎం జ్యోతి, ఆశవర్కర్లు ప్రమిల, నిర్మల, మాయాబాయి, కాంతబాయి, భీమక్క పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆలయంలో పూజలు

వాంకిడి: గత బీఆర్ఎస్ హయాంలో అన్నివర్గాల అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని రాంనగర్‌లో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయాన్ని ఆదివారం ప్రారంభించి పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ నిర్వాహకులు పూజలు చేసి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఆలయ నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. జెడ్పీటీసీ అజయ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకురాలు మర్సుకోల సరస్వతి, పీఏసీఎస్ చైర్మన్ పెంటు, మాజీ సర్పంచ్ బండె తుకారాం, తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, తదితరులు

కనుల పండుగగా జగన్నాథ రథయాత్ర



పాల్గొన్న భక్తజనం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్‌లో జగన్నాథ రథయాత్ర కనుల పండగగా సాగింది. వేదమందిర్ నుంచి ప్రారంభమైన రథయాత్ర గణేశ్ మందిర్ వరకు చేరింది. ఉమ్మడి నజ్రూల్‌నగర్ పంచాయతీలోని 13 గ్రామాల భక్తజనం తరలిరావడంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

మత్తుపదార్థాల నిర్మూలనకు సహకరించాలి

తాండూర్: మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని తాండూర్ సీఐ కుమారస్వామి అన్నారు. పోలీసు సర్కిల్ కార్యాలయంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులతో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గంజాయి, ఇతర రకాల మత్తు పదార్థాలకు అలవాటు పడి అనేకమంది జీవితాలను పాడు చేసుకుంటున్నారన్నారు. మత్తు బారి నుంచి సమాజాన్ని కాపాడుకోవడానికి పోలీసులు చేస్తున్న కృషికి ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థ శ్రేణులు, బాధ్యత కలిగిన ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ పూసాల ప్రణయ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ.ఈసా, నాయకులు పుట్ట శ్రీనివాస్, జుబేర్, మోమిన్ అలీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



నాయకులతో మాట్లాడుతున్న సీఐ కుమారస్వామి

రండి.. సంఘంలో చేరండి!

- సభ్యత్వాలే లక్ష్యంగా దిశానిర్దేశం
- ఆర్థికాభివృద్ధే లక్ష్యం
- నూతన మహిళలకు అవకాశం
- ఇప్పటికే చేరిన 45 మంది సభ్యులు



కెరమెరి మండల సమాఖ్య కార్యాలయం



కెరమెరిలో నూతన సంఘాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కెరమెరి: పొదుపు సంఘాల మహిళలను మరింత చైతన్యవంతులను చేసి సమాంతర వ్యవస్థను నిర్వహిస్తున్న క్రమంలో కొత్త సభ్యత్వాలపై గ్రామీణాభివృద్ధి సంస్థ దృష్టిసారించింది. ఈ నేపథ్యంలో ప్రతి మహిళలకు సభ్యత్వం ఉండేలా మండల సమాఖ్య, ఐకేపీ అధికారులు చూసుకుంటున్నారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో వీవోలు 34 ఉండగా..గ్రామైఖ్య సంఘాలు 520, సభ్యులు 5623 ఉన్నారు. ఇప్పటివరకు నూతన సంఘాలు నాలుగు ఏర్పాటు చేయగా అందులో 45 మంది చేరారు.

అధికారులు ఆదేశాలు

నూతన సంఘాల ఏర్పాటుకు రాష్ట్రస్థాయి అధికారులు ఇటీవల ఆదేశాలు జారీచేయడంతో మండలంలోని సీసీలు అదే పనిలో ఉన్నారు. ప్రతీరోజు గ్రామాలు సందర్శించి మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకు చేరని వారు, లేదా నూతనంగా వివాహమై గ్రామాల్లో ఉన్నవారికి ఈ అవకాశం లభించే అవకాశం ఉంది. నూతనంగా వివాహమైన వారి వివరాలు సేకరిస్తున్నారు. లక్ష్య సాధనకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు.

వీరే అర్హులు!

నిరుపేదలు, బీపీఎల్ కుటుంబాల గల వారు 15 నుంచి 60 ఏళ్ల లోపు ఉన్నవారు కొత్త సంఘంలో చేరేందుకు అర్హులు. వ్యాపారం చేసే వారు, ఉన్నత స్థాయిలో ఉన్నవారు, ఉద్యోగులు అర్హులు కాదని అధికారులు చెబుతున్నారు. ఎలాంటి ఆసరా లేని వారిని సంఘంలో చేర్చుకుని ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నంలో భాగమే నూతన సంఘాల ఏర్పాటు అని తెలుస్తోంది. ఈనేపథ్యంలో మహిళలు సంఘంలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

అర్హులు చేరవచ్చు



ఇప్పటివరకు ఏ సంఘంలో లేని వారు, కొత్తగా పెళ్లయిన వారికి సంఘంలో చేరడానికి అర్హులు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. క్లస్టర్ స్థాయిలో ఉన్న సీసీల వద్ద తమ తమ పేర్లు నమోదు చేయవచ్చు.

– జగదీశ్వర్, ఏపీఎం, కెరమెరి

నిషేధిత పొగాకు విక్రేతపై కేసు

లింగాపూర్: మండలంలోని రామునాయక్ తండా గ్రామానికి చెందిన జాదవ్‌రామ్ తన కిరాణా షాపులో నిషేధిత పొగాకు, తంబాకు, గుట్కా విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు పోలీసులు శనివారం వెళ్లి దుకాణాన్ని పరిశీలించారు. రూ.690 విలువైన నిషేధిత పొగాకు స్వాధీనం చేసుకున్నారు. దుకాణాదారుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

పశువుల వాహనం పట్టివేత

వాంకిడి: మహారాష్ట్ర నుంచి ఐచర్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పశువులను బంబార గ్రామ సమీపంలో నేషనల్ హైవేపై పట్టుకున్నట్లు ఏఎస్సై పోశెట్టి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో గోయేగాం గ్రామానికి చెందిన షేక్ జమీర్, మహ్మద్‌ఖాన్ ఐచర్ వాహనంలో ఎలాంటి పత్రాలు లేకుండా పశువులను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఏఎస్సై తెలిపారు. వాహనంలో ఐదు ఆవులు, రెండు దూడలు ఉండగా వాటిని గోశాలకు తరలించనున్నట్లు పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



పట్టుబడిన వాహనంలో పశువులు

'సాగులో ఉన్న రైతులకు పట్టాలివ్వాలి'

చెన్నూర్: మండలంలోని సోమన్‌పల్లి గ్రా మంలో 20ఏళ్ల నుంచి దళితులు సాగు చేసుకుంటున్న భూమికి అధికారులు పట్టాలిచ్చి హక్కు కల్పించాలని సోమన్‌పల్లి గ్రామానికి చెందిన దళిత కులస్తులు తోకల లక్ష్మణ్, లింగయ్య అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివా రం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడా రు. ఎస్సీ మాదిగ కులానికి చెందిన సుమారు వంద కుటుంబాలు సర్వే నంబర్ 306లో 49ఎకరాలు, 1267సర్వే నంబర్‌లో 70ఎకరా ల భూములలో సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నామని తెలిపారు. మాజీ సర్పంచ్‌తో పాటు మరికొంత మంది దళిత భూముల ను కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరో పించారు. రెవెన్యూ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి సాగులో ఉన్న రైతులకు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు శేఖర్, జంపయ్య, సు రేశ్, ప్రశాంత్, మల్లేశ్, బన్నీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సోమన్‌పల్లి గ్రామస్తులు

సంతాప సభ



రాథోడ్ రమేశ్‌కు నివాళులు

శ్రీరాంపూర్: మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ సేవలు మరువలేనివని ఆయన అభిమానులు కొనియాడారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జక్కుల రాజేశం ఆధ్వర్యంలో ఆదివారం ఆయన సంతాప సభ నిర్వహించారు. ఈ సభకు రాథోడ్ రమేశ్‌తో నాడు టీడీపీలో పని చేసిన ఆయన అభిమానులు హాజరయ్యారు. మాజీ మంత్రి బోడ జనార్దన్, మంచిర్యాల మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్ తదితరులు హాజరయ్యారు. బెల్లంకొండ మురళీ, ఎం. గురవయ్య, బండారి మల్లేశ్, తిప్పని రామయ్య, కాశెట్టి నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.